క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పాఠశాలను పరిశీలిస్తున్న డీపీవో

లక్సెట్టిపేట: పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీపీవో వెంకటేశ్వర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. వంటగది షెడ్, వంట పాత్రలు, వంట గదిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందజేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో కే.సరోజ, ప్రిన్సిపాల్స్ ఉన్నారు.

బిల్ కలెక్టర్‌ను సస్పెండ్ చేయాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ బిల్ కలెక్టర్ విజయ్‌ని వెంటనే సస్పెండ్ చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూరగాయల మార్కెట్ షెట్టర్లకు డ్రా తీసే క్రమంలో బిల్ కలెక్టర్ తోకల మౌనిక పేరుతో ఉన్న ఓ చిట్టీని జేబులో నుంచి తీసి కమిషనర్‌కు అందజేసి అవకతవకలకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. ఆ సంఘటన సెల్‌ఫోన్ కెమెరాలో రికార్డు అయ్యిందని తెలిపారు. బిల్ కలెక్టర్ అందజేసిన చిట్టీ ప్రకారంగానే మౌనిక పేరును ప్రకటించి, ఆమెకు షెట్టర్‌ను కట్టబెట్టారని తెలిపారు. అక్రమపద్ధతిలో కేటాయించిన మౌనిక షెట్టర్‌ను రద్దు చేసి, లబ్ధిదారుల జాబితా నుంచి ఆమె పేరును బేషరతుగా తొలగించాలని తెలిపారు. మార్కెట్‌ను కూలగొట్టే సమయంలో నిజమైన వ్యాపారులు ఎవరున్నారో వారికి మాత్రమే షెట్టర్లు కేటాయించాలని తెలిపారు. అక్రమాలకు తావిచ్చిన బిల్ కలెక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని నిరసన



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న నాయకులు

మంచిర్యాలఅర్బన్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో స్థానిక ఐబీ చౌరస్తా అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పీడీఎస్‌యూ ఇచ్చిన 72గంటల కళాశాలల బంద్‌లో భాగంగా 'ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వండి–విద్యా భవిష్యత్‌ను నిలబెట్టండి' అనే నినాదంతో ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు సికిందర్, జిల్లా బాధ్యులు కార్తీక్, అన్వేష్, సుమంత్, వైష్ణవి, రోజా, మేఘన పాల్గొన్నారు.

'సీఎస్ఐ చర్చి ప్రహరీ కూల్చివేయొద్దు'

బెల్లంపల్లి: రోడ్డు విస్తరణలో భాగంగా చర్చి ప్రహరీని కూల్చివేయొద్దని బెల్లంపల్లి సీఎస్ఐ చర్చి గురువు రెవరెండ్ సీ.హెచ్.అశోక్, సంఘ సభ్యులు కోరారు. సామూహికంగా తరలివచ్చిన సంఘ సభ్యులు బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఎస్ఐ చర్చ్ సంఘ సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

48మందికి ఉచిత కంటి ఆపరేషన్లు



కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న వారితో లయన్స్ క్లబ్ సభ్యులు

పాతమంచిర్యాల: లయన్స్‌క్లబ్ మంచిర్యాల, రామకృష్ణాపూర్ శాఖ, లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ ఆధ్వర్యంలో 48మందికి ఉచిత కంటి ఆపరేషన్లు నిర్వహించారు. శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి లయన్స్‌క్లబ్ సభ్యులు బుధవారం బ్రెడ్, పాలు, పండ్లు పంపిణీ చేసి వారి స్వస్థలాలకు పంపించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మంచిర్యాల శాఖ అధ్యక్షుడు కారుకూరి చంద్రమౌళి, విజన్ కేర్ కన్వీనర్ సుగుణాకర్ రెడ్డి, ప్రోగ్రాం చైర్‌పర్సన్ వి.మధుసూదన్ రెడ్డి, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

రోడ్డు బురదమయం..



కన్నెపల్లి మండలంలోని కాజీపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు బురదమయంగా మారడంతో కాజీపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బెల్లంపల్లి నుంచి కన్నెపల్లికి వెళ్లే పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి కాజీపల్లికి బీటీ రోడ్డు మంజూరు కాగా కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారు. పనులకు నాసిరకం మట్టి వాడటంతో చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదమయంగా మారుతోంది. సంబంధిత గుత్తేదారు నాణ్యమైన మట్టిని వినియోగించి త్వరగా బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని, అధికారులు పనులను పర్యవేక్షించి పనులు నాణ్యతగా చేపట్టేలా చూడాలని ప్రజలు వేడుకుంటున్నారు. – భీమిని

ప్రయాణం నరకమే..!



మంగెనపల్లి–నాగారాం వెళ్లే ప్రధాన రహదారిపై నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ వంతెన వద్ద ఇరువైపుల రోడ్డు బురదమయంగా మారింది. కల్వర్టు నిర్మిత సమయంలో కాంట్రాక్టర్ తారురోడ్డు వేయకపోవడం, గుంతలమయంగా ఉంచడంతో ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరింది. నిత్యం వందలాది వాహనాల రాకపోకలు ఉండే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. బెల్లంపల్లికి వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టు వద్ద మరమ్మతు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. – వేమనపల్లి

'ఉపాధి'లో షెడ్ల నిర్మాణాలు



లంబడిపల్లిలో నిర్మాణం పూర్తయిన పశువుల షెడ్డు

- జిల్లాకు 1516 పశువుల షెడ్లు మంజూరు
- కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తి, మరికొన్ని చోట్ల కొనసాగుతున్న పనులు

చెన్నూర్‌రూరల్: పశువులు ఉండి వాటిని సంరక్షించే స్తోమత లేని ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు పశువుల పాక(షెడ్లు)ను ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించి ఇచ్చేందుకు శ్రీకారం చుట్టింది. షెడ్డు నిర్మాణానికి రూ.90వేలు అందిస్తుంది. జిల్లా వ్యాప్తంగా 16మండలాలకు గాను మొత్తం 1516పశువుల షెడ్లు మంజూరయ్యాయి. వీటిలో 223పశువుల షెడ్ల నిర్మాణాలు పూర్తి కాగా, 490నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రైతులు మరింత మంది ముందుకొచ్చి నిర్మించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఉపాధిహామీలో జాబ్ కార్డు కలిగి ఉండి, నాలుగు పశువులు ఉన్న వారికి షెడ్లను మంజూరు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందిని గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఉపాధిహామీ ఉన్నతాధికారులు అప్రమత్తం చేస్తున్నారు.

కొనసాగుతున్నాయి..



ఉపాధిహామీ జాబ్ కార్డు కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం ఉపాధిహామీ ద్వారా పశువులకు షెడ్లు నిర్మిస్తుంది. ఇందుకోసం గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తాం. ఇప్పటికే కొన్నిచోట్ల షెడ్ల నిర్మాణాలు పూర్తి కాగా, మరికొన్ని చోట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

– కిషన్, డీఆర్డీవో, మంచిర్యాల

'ఆరోపణలు చేస్తే సహించం'

చెన్నూర్: బీఆర్ఎస్ నాయకులు మంత్రి వివేక్ వెంకటస్వామిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్ రావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం మాట్లాడారు. కోటపల్లి మండలం కొల్లూరు ఇసుక రీచ్ నుంచి తట్టెడు ఇసుక అక్రమ రవాణా జరగద్దని మంత్రి వివేక్, అధికారులు ఆదేశాలు జారీ చేశారన్నారు. అవినీతి అక్రమ దందాలకు అలవాటు పడిన బీఆర్ఎస్ నాయకులు సిగ్గు లేకుండా మంత్రిపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో నాయకులు సూర్యనారాయణ, హిమవంతరెడ్డి, నాగరాజు, సుశీల్‌కుమార్, చింతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని సీపీఐ పట్టణ కమిటీ సభ్యులు మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్‌ను కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు. బజారు ఏరియాలో వాహనాల పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిప్ప నర్సయ్య, పట్టణ కార్యదర్శి ఏ.రాజమౌళి, సహాయ కార్యదర్శి తిలక్ అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధం'



మాట్లాడుతున్న బేర సత్యనారాయణ

నస్పూర్: ఇటీవల కొందరు కాంగ్రెస్ నాయకులు తనపై చేసిన ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధమని మంచిర్యాల మాజీ ఎంపీపీ, మాజీ కౌన్సిలర్ బీఆర్ఎస్ నాయకుడు బేర సత్యనారాయణ అన్నారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి బుధవారం మాట్లాడారు. నస్పూర్ పట్టణంలో పలు ప్రాంతాల్లో భూములు కబ్జా చేసినట్లు కాంగ్రెస్ నాయకుడు ధర్ని మధూకర్ తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ, తనను మానసిక క్షోభకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కడైనా గజం భూమి కబ్జా చేసినట్లు నిరూపిస్తే రాజకీయాలు మానేసి, ఊరు వదిలి వెళ్లిపోతానని సవాలు విసిరారు. భూమి కబ్జా చేసిన వారిపై విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తనపై చేసిన ఆరోపణలను ఈ ఆదివారం వరకు నిరూపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ వంగ తిరుపతి, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మేరుగు పవన్‌కుమార్, కందుల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్తంభాలు సరిచేశారు

సాక్షి ఎఫెక్ట్..

నెన్నెల: మండలంలోని జోగాపూర్ శివారు పంట పొలాల్లో ఒరిగిన విద్యుత్ స్తంభాలను బుధవారం విద్యుత్ అధికారులు సిబ్బందితో కలిసి సరిచేశారు. స్తంభాలు పూర్తిగా ఒరిగిపోయి ప్రమాదకరంగా మారగా 'ఒరిగిన స్తంభాలు' అనే శీర్షికన గత నెల 30న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. వెంటనే జేసీబీ, పది మంది సిబ్బంది సాయంతో ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను సరిచేశారు. నెన్నెల విద్యుత్ ఏఈ రాజన్న దగ్గరుండి పనులు పర్యవేక్షించారు. ఈ సమస్యను పత్రికలో ప్రచురించి పనులు జరిగేలా చేసిన 'సాక్షి'కి రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



మహిళల భద్రత కోసమే షీ టీం



మాట్లాడుతున్న నరేశ్

నస్పూర్: మహిళల భద్రత కోసం షీ టీం నిరంతరం పని చేస్తుందని జిల్లా షీ టీం ఇన్‌స్పెక్టర్ నరేశ్ అన్నారు. మండలంలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు డ్రగ్స్, షీ టీంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, షీ టీం ప్రాముఖ్యత, పోక్సో చట్టం, బాల్యవివాహాలు, ఈవ్ టీజింగ్, సైబర్ క్రైం, టీ సేఫ్ అప్లికేషన్, సైబర్ హెల్ప్‌లైన్1930, డయల్ 100పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో షీ టీం ఎస్సైలు హైమా, ఉషారాణి, కానిస్టేబుళ్లు జ్యోతి, శ్రీలత, భరోసా సెంటర్ కో ఆర్డినేటర్ విజయ, జిల్లా న్యాయసేవా సమితి సభ్యులు శ్రీనివాస్, రాములు, సదయ్య, కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రి న్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

జన్నారం: మండల కేంద్రంలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలను బుధవారం ఎంపీడీవో ఉమర్ షరీఫ్ తనిఖీ చేశారు. వంటగది పరిసరాలు, వంటలు, ఆశ్రమ పాఠశాల పరిసరాలను తనిఖీ చేశారు. వర్షకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్



మాట్లాడుతున్న సుధాకర్

జన్నారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సీజనల్ వ్యాధులపై ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. టీబీ, సికిల్ సెల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో మలేరియా, టైఫాయిడ్, డెంగీ లాంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉన్నందునా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. గ్రామాల్లో పర్యటించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ఉమా శ్రీ, లక్ష్మీ, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: కీటక జనిత, సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గల మహాత్మ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో బుధవారం నిర్వహించిన సమావేశంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, రాంమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రావ్య, ఏఎన్‌ఎం రాజేశ్వరీ, ఉపాధ్యాయురాలు నవ్య, గీత వాణి, సువర్ణ, ప్రియాంక, తదితరులు ఉన్నారు.

'పరిశ్రమ రద్దు చేయాలి'



మాట్లాడుతున్న ధర్మవరపు బ్రహ్మయ్య

పాతమంచిర్యాల: హైదరాబాద్ శివారులోని మహేశ్వరంలో ఏర్పాటు చేస్తున్న గోల్డ్ నగల తయారీ కంపెనీతో స్వర్ణకార కులవృత్తిపై ప్రభావం పడి, స్వర్ణకారులు ఉపాధి అవకాశాలు కోల్పోయే ప్రమాదముందని జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు ధర్మవరపు బ్రహ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్వర్ణకారుల వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని, చేతి వృత్తిదారులకు చేయూతనందించాలని, మలబార్ గోల్డ్ పరిశ్రమ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా స్వర్ణకారుల సంఘం ప్రధాన కార్యదర్శి మునిగంటి హనుమయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు గుండోజు రమేశ్ తదితరులు ఉన్నారు.

బొగ్గు నాణ్యత పాటించాలి

- జీఎం శ్రీనివాస్



అధికారులతో మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్

శ్రీరాంపూర్: బొగ్గు నాణ్యత పాటించాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. జీఎం కార్యాలయంలో ఉత్పత్తి, ఉత్పాదకత, రక్షణ, వర్షాకాలంలో ఉపరితల గనుల్లో ఎదురయ్యే ఇబ్బందులపై అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. నాణ్యమైన బొగ్గును రవాణా చేయాలన్నారు. జూన్ నెలలో నిర్దేశించిన ఉత్పత్తి సాధించిన ఉత్పత్తిపై సమీక్షించుకొని, జూలై నెలలో లక్ష్యాల సాధన కోసం కృషి చేయాలన్నారు. వర్షంతో ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవికుమార్, ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ అధికారులు ఏ వెంకటేశ్వర రెడ్డి, చిప్ప వెంకటేశ్వర్లు, డీజీఎంలు అనిల్‌కుమార్, ఆనంద్ కుమార్, హరి నారాయణ, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

శ్రీరాంపూర్: కార్మికవర్గాన్ని అణిచివేయడానికి కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు బుధవారం డిమాండ్ చేశారు. ఆర్కే 5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో జేఏసీ నాయకులు మాట్లాడారు. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా ఈ నెల 9న నిర్వహించే దేశవ్యాప్తను సింగరేణిలో విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, హెచ్ఎంఎస్ కేంద్ర నాయకులు తిప్పారపు సారయ్య, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో వాసిరెడ్డి సీతారామయ్య, కాంపెల్లి సమ్మయ్య, నాగరాజు గోపాల్, మేడిపల్లి సంపత్, రాములు, తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

మేనేజర్‌కు సన్మానం



సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

కాసిపేట: మందమర్రి ఏరియా కాసిపేట గని మేనేజర్‌గా పనిచేసి, ఏరియా రక్షణాధికారిగా పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న భూ శంకరయ్యను, నూతనంగా మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన సతీశ్‌లను గనిపై అధికారులు, గుర్తింపు సంఘం, కార్మిక సంఘాల నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ నాయకులు చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, ఫిట్ సెక్రెటరీ మినుగు లక్ష్మీనారాయణ, రక్షణాధికారి నిఖిల్, ఐఎన్‌టీయూసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ బన్న లక్ష్మణ్‌దాస్, ఫిట్ సెక్రెటరీ రవీందర్, టీబీజీకేఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం బూట్లు పంపిణీ

శ్రీరాంపూర్: సింగరేణిలో నాసిరకం బూట్లు పంపిణీ చేస్తున్నారని సీఐటీయూ శ్రీరాంపూర్ బ్రాంచీ అధ్యక్షుడు గుల్ల బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మల్లేపల్లి నియామకంపై హర్షం

శ్రీరాంపూర్: నాగార్జునసాగర్ బుద్ధవనం ప్రాజెక్టు ప్రత్యేక అధికారిగా మల్లేపల్లి లక్ష్మయ్యను రెండోసారి ప్రభుత్వం నియమించడంపై సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ కోల్‌బెల్ట్ కన్వీనర్లు తొగరు సుధాకర్, అందుగుల రాజేశం, గోషిక మల్లేశ్ బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలి



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

రామకృష్ణాపూర్: మంచిర్యాల నుంచి రామకృష్ణాపూర్ పట్టణానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఐ నాయకులు బుధవారం మంచిర్యాల డిపో మేనేజర్ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గతంలో రైల్వేగేటు ఉండటంతో బస్సు నడిపించలేదని, ఇప్పుడు క్యాతనపల్లి ఫ్లై ఓవర్ బ్రిడ్జి పూర్తి అయినందునా వేలాది ప్రజల సౌకర్యార్థం బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కాగా బస్సు ఏర్పాటు చేస్తామని డీఎం హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఇప్పకాయల లింగయ్య, మిట్టపెల్లి శ్రీనివాస్, పౌల్ తదితరులు పాల్గొన్నారు.